# ★ పేకమేడ

యన్. వసంతకుమార్

ఆరోజు ఆదివారం. ఆఫీసుకు సెలవు కాబట్టి గదిలో కూర్చుని వీక్లీ సెట్ చదువుకుంటున్నాను. పుస్తకం చదువుతున్నానన్న మాటే కాని క్రిందటిరోజు రామారావు చెప్పినమాటలు ఇంకా ప్రతిధ్వనిస్తున్నై చెవిలో. 'ఏరా, కిరూ. జీతం సంపాదిస్తున్నావ్ ఇంకా గృహస్థుడివి కావా ఏమిట్రా' అని వాడు ఒకటే గోల. కాని నాకుమటుకు అదేమిటో ఒక్క సంబంధం నచ్చలేదు. ఇలా ఆలోచిస్తూనే పుస్తకంమూసి సిగరెట్ తీసి వెలిగించాను. ఇంతలో నే రామారావు వచ్చాడు కాని వాడు ఆ రోజున ఏదో వింతగా కనపడ్డాడు. కళ్లలో ఏదో తెలియని ఆనందం ప్రతిఫలిస్తోంది.

'ఏంరోయ్ రామం ఏమిటి ఇవ్వాళ చాలా హుషారుగున్నావు" అన్నాను అసలుసంగతేమిటో తెలుసుకోవాలనే ఉద్దేశంతో 'మరేం విశేషం లేదురా, నీకోసం ఓ పెళ్లి సంబంధం చూశాను. అరే ఏంచెప్పనురా ఆఅందం. కలలో కూడా ఊహించుకో లేవోయ్' అన్నాడు అదో మాదిరిగా మొఖంలో సంతోషచ్ఛాయలు తొంగిచూస్తుంటే.

'ఎవర్రా' అని అడిగాను ఆదుర్దాతో. 'పున్నమ చంద్రుని ధిక్కరించే ఆమె ముఖారవిందం. సంపెంగ పువ్వులాంటి ఆమెముక్కు, ఇతరులను ఇట్టే ఆకర్షించే ఆ చిన్నారి చిలిపి కళ్లు! ఏంచెప్పమంటావురా' అన్నాడు వాడు.

'ఆ!' అన్నా.

'ఆ! ఏమిటి, నీముఖం. ఆమె నడుస్తుంటే నిజంగా ఏ అప్సరస్త్రీయో భూలోకంలో శాపవశాత్తుగా అవతరించిందా అనిపిస్తుందిరా'

అబ్బా...

'తుమ్మెద రెక్కల్ని ధిక్కరించే ఆమెనల్లని కురులు. నిజంగా ఆజడ నల్లత్రాచులా ఉంటుందంటే నమ్ము బ్రదర్"

ఊ!

తెల్లటిచీర ధరించి దానిమీద ఆనీలిరంగు జాకెట్టు తొడిగి చిరునవ్వులు ఒలకపోస్తూ మాట్లాడుతుంటే నిజంగా బ్రహ్మదేవుడు ప్రపంచంలో గల సౌందర్యం ఆమెలో పుంజీభవించేటట్టు సృష్టించాడా అనిపిస్తుందిరా'

'ఏం అంతసౌందర్యరాశియా ఏరా' అన్నాను ఆమెనుగురించి వివరాలు ఇంకా తెలుసుకోవాలనే ఉత్సాహంతో. ఆమెనుగూర్చి నామనసులో అప్పుడే ఏవేవో తీయనితలపులు అవ్యక్తంగా చెలరేగుతున్నై.

'తెల్లటివెలుతురులో తళతళ మెరసే ఆమె మేలిమిఛాయ శరీరమూ, సన్నటిగులాబీలాంటి ఆ వేళ్లూ, నక్షత్రాల్లాగ మెరిసే మెళ్లోని నెక్లెస్ రాళ్లు అసలు ఆమెఏదైనా అజంతా చిత్రమా, లేక నిజంగా శ్రీమూర్తియేనా అనే భ్రమ కల్గిస్తుందిరా ఆమెసౌందర్యం!'

'సరే' అన్నా దీర్ఘంగా గాలివిడుస్తూ.

'నిజంగా అటువంటి సౌందర్యరాశిని పొందలేని, వాడిజీవితం వ్యర్థంరా. కానిపాపం ఆమె జీవితమంతా అడివిగాచిన వెన్నెలవలె గడచిపోతోందిఆమెప్రాయమంతా' అన్నాడు రామారావు.

"ముందు ఆపిల్ల ఎవరోచెప్పరా చంపక' అన్నాను.

'మాయింటి దగ్గిరేరా యిల్లు. పేరుమటుకు సార్థక నామధేయం లే- సుందరి.

వాళ్ళనాన్నగారి పేరేమిటి? ఆయనఏంచేస్తారు?' అని అడిగాను. 'ఆయనపేరు నారాయణరావు. తాలూకాలో పనిచేస్తున్నాడు. కట్నాలు మాత్రం ఎక్కువ ఇవ్వలేడురోయ్' అన్నాడు. నేనేదో ఎక్కువకట్నం కోరతానేమో అని అనుకున్నాడు.

'గోత్రంకూడా ఫరవాలేదు. ఇహానీవుచూడడమే తరవాయిరా?'

'సరే ఎప్పుడువెళ్దాం మరి' అన్నాను ఏమైనా ఆసౌందర్యరాశినిపొందాలనే కృతనిశ్చయంతో.

'కాని ఒక చిన్న సంగతిరా' అన్నాడువాడు సంశయంతో మెల్లిగా.

'ఏమిట్రాఅది' అన్నావిసుగ్గానే.

"అబ్బే మరేంలేదురా, ఆమెకి ఆరేళ్ళవయస్సులోనే వాళ్ళఅమ్మమ్మ కోరికమీద వివాహంచేశారు. కాని పెళ్ళయిన సంవత్సరంలోనే ఆకుర్రాడు చనిపోయాడు. అయినా తలితండ్రులు ఆమెకి తిరిగి వివాహం చేయనిశ్చయించారు. ఆమె బాలవిధవ. అదొక్కటే ఆమెలోమచ్చ."

ఇంకా ఏదోఅంటూనే ఉన్నాడు. హఠాత్తుగా పెద్దచప్పుడైంది. న్యూయార్కులో భవనాలన్నింటినీ తలదన్నిన పేకమేడ ఫెళఫెళా విరుచుకు పడిపోయింది.